క్లుప్తంగా

ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధికారులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోల రమేశ్‌ను జిల్లా అధికారులు సన్మానించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థి చరణ్‌ను అభినందించారు. సన్మానించిన వారిలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, సాయికిరణ్, తదితరులున్నారు.

చెరువు మట్టి తరలింపుపై కమిషనర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలో ఉపాధి పనుల ద్వారా చెరువు నుండి తీసిన మట్టిని ఇటుక బట్టీల వ్యాపారులకు అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని హైద్రాబాద్ పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్‌కు గ్రామ నాయకులు బండి కుమార్ ,దొంతరవే రమేష్‌లు శనివారం ఫిర్యాదు చేశాడు.ఈ సందర్భంగా చెరువు పూడికతీత పనుల్లో తీసిన మట్టిని ఏలాంటి అనుమతులు లేకుండాగ్రామానికి చెందిన ఎంపిటిసి పోల్సాని రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ భర్త బొజ్జం తిరుపతిరెడ్డి, మాజీ వార్డు మెంబర్ ఓరుగంటి లత, గ్రామ కార్యదర్శి శివరంజని, ఫీల్డ్ అసిస్టెంట్ అనురాధలు కుమ్మకై నిబంధనలకు విరుద్ధంగా రైతులకు చెందాల్సిన మట్టిని జమ్మికుంట పట్టణంలోని ఇటుక బట్టీల నిర్వాహకులకు అమ్మకాలు చేశారని పేర్కొన్నారు.ఎంపిడివోకు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి, కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు నామమాత్రంగా షోకాజ్ నోటిసులు ఇచ్చారని , సుమారు 150 ట్రిప్పుల మట్టి అమ్ముకున్న వారిపై ఏలాంటి చర్యలు తీసుకోకుండా తూతు మంత్రంగా షోకాజ్ నోటిసులతో సరిపుచ్చడం భాధకరమని ఫిర్యాదు తెలిపారు. మట్టి అమ్ముకున్న,అందుకు సహకరించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ,రైతులకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆర్థికసాయం


భాస్కర్ కుటుంబానికి నగదు అందజేస్తున్న నేచర్ యూత్ క్లబ్ సభ్యులు

రామడుగు: మండలం వెదిర గ్రామానికి చెందిన బందేల శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. శ్రీనివాస్ కుటుంబానికి 1994–95 పదోతరగతి మిత్రులు రూ.18,000 అందజేశారు. మండలంలోని గో పాల్‌రావుపేట గ్రామానికి చెందిన ముమ్మాడి రమ భాస్కర్ కుటుంబానికి నేచర్ యూత్ అసోసియేషన్ సభ్యులు శనివారం రూ.83 వేలు అందజేశారు. సోషల్ మీడియా ద్వారా కుటుంబ పరిస్థితిని తెలుసుకొని కొంత నగదు హాస్పిటల్ ఖర్చులకు మరికొంత కుటుంబ అవసరాలకు ఇచ్చామని పేర్కొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు కాసారపు పర్శరాంగౌడ్, గౌరవాధ్యక్షుడు నేరెళ్ల అంజయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీకాంత్‌గౌడ్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్ రెడ్డి, నాయకులు ఎడవెల్లి పాపిరెడ్డి, క్లబ్ సభ్యులు దాసరి అనిల్, పైండ్ల శ్రీనివాస్, గడ్డం రత్నాకర్, ఏపూరి వెంకటేశ్‌గౌడ్, దాసరి రవిశాస్త్రి పలువురు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

జమ్మికుంట: మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బండి రాజశేఖర్ ఇటీవల మృతి చెందగా పార్టీ సభ్యత్వం ఉండగా రూ.రెండు లక్షల ప్రమాదబీమా చెక్కును కేటీఆర్ సమక్షంలో తెలంగాణ భవన్‌లో పొన్నల లక్ష్మయ్య, వావిలాల ఎంపీటీసీ మర్రి మల్లేశం, ఇతర నాయకుల చేతుల మీదుగా శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందగా పార్టీ బీమా అందజేసిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, రాజశేఖర్ కుటుంబ సభ్యులున్నారు.

ఇటు అవగాహన.. అటు తనిఖీ


హుజూరాబాద్‌రూరల్: రైతులతో మాట్లాడుతున్న ఏవో సునీల్‌కుమార్


చొప్పదండి: అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

చొప్పదండి: పట్టణంలోని పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం వ్యవసాయ, పోలీస్‌శాఖ అధికారులు తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. రైతుల వారీగా అమ్మకాలు పొందుపరచాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ టి. రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రశీదులు పొందాలి

రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో దుకాణదారుల నుంచి రశీదులు పొంది పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని మండల వ్యవసాయాధికారి వంశీక్రిష్ణ కోరారు. గుమ్లాపూర్, చొప్పదండి, ఆర్నకొండ, రుక్మాపూర్, వెదురుట్ల గ్రామాల్లో విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. లూజుగా ఉన్న విత్తనాలను కొనుగోలు చేయొద్దని, లైసెన్స్ ఉన్న డీలర్ వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు.

హుజూరాబాద్‌రూరల్: విత్తనాల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో చందుపట్ల సునీల్ కుమార్ అన్నారు. మండలంలోని రాంపూర్‌లోని గ్రామ రైతులతో సమావేశమై విత్తనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల వివరించారు. బస్తాలపై ఉన్న ధరకే కొనాలని, ఎక్కడైనా తక్కువ ధరకు వస్తున్నాయని తీసుకుంటే పంట దిగుబడి తగ్గడంతోపాటు నష్టపోతారన్నారు. అనుమతులు లేకుండా విత్తనాల అమ్మువారి వివరాలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వానాకాలంలో లోతు దుక్కులు చేసుకోవాలని, వ్యవసాయశాఖ అమలుపరిచే సంక్షేమ పథకాలను వివరించారు. ఏఈవో సతీష్, పంచాయతీ కార్యదర్శి జయేందర్, కారోబార్ రామస్వామి, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఏఓ శ్రీనివాస్, ఎస్సై లక్ష్మారెడ్డి తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కన్నాపూర్, తాడికల్ గ్రామాల్లో ఏవోలు సునంద, లక్ష్మీప్రసన్న రైతులకు అవగాహన కల్పించారు.

గన్నేరువరం: మండలకేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను తిమ్మాపూర్ సర్కిల్ సీఐ స్వామి, ఏవో కిరణ్మయి తనిఖీ చేశారు. రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి ఎరువులు, విత్తనాలు దుకాణాల్లో సిద్ధంగా ఉన్నాయని, రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని కోరారు. ఎస్సై తాండ్ర నరేష్, ఏఈవోలు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని మక్తపల్లె గ్రామంలో విత్తన కొనుగోలుపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ విస్తరణ అధికారి స్వామి వివరించారు. విత్తన ప్యాకెట్ మీద తయారీ తేదీ, కాలం చూసుకోవాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్, కార్యదర్శి వనిత, రైతులున్నారు.


గన్నేరువరంలో రికార్డులు తనిఖీ చేస్తున్న సీఐ స్వామి, ఏవో కిరణ్మయి

రామడుగు: మండలకేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లోని పలు ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ సురేందర్ తనిఖీ చేశారు. ఎవరైనా నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పల్లె ప్రకృతి వనాల సందర్శన


అధికారులతో మాట్లాడుతున్న డీపీఓ రవీందర్

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో పల్లెప్రకృతి వనం, డంపింగ్‌యార్డ్, వైకుంఠధామాలను డీపీఓ రవీందర్ శనివారం సందర్శించారు. నర్సరీ, ప్రకృతివనం కంపోస్ట్ ఎరువులను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. ప్రతి రోజు తడి, పొడి చెత్తను వేరుగా ట్రాక్టర్ల లో షెడ్డుకు తరలించాలని సూచించారు. డీపీఓ వెంట ఎంపీఓ బషీరొద్దీన్, కార్యదర్శి స్వప్న ఉన్నారు.

మొక్కలు సిద్ధం చేయాలి


నర్సరీని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు

రామడుగు: మండలంలోని వెలిచాల, షానగర్ గ్రామాల్లో శనివారం రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్‌రావు పర్యటించారు. నర్సరీలు, శ్మశానవాటిక, వర్మీకంపోస్టు షెడ్డులను తనిఖీ సందర్శించారు. హరితహారం కోసం మొక్కలు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. డీఎల్‌పీవో రాంబాబు, ఏపీడీ కృష్ణ, ఎంపీడీవో రాజేశ్వరీ, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, ఏపీవో రాధ, కార్యదర్శులు మధు, అరుణ్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి జాతర


మానకొండూర్‌రూరల్: జాతరకు హాజరై మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


తిమ్మాపూర్: ఆలయంలో పూజలు చేస్తున్న మహేశ్వర శర్మ, పురుషోత్తం

మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి జాతర మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. వేదపండితులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ ప్రత్యేక పూజలు చేశారు.

మత్స్యగిరీంద్రస్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామిని న్యాయమూర్తి పద్మసాయి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు ఇచ్చారు. మండలంలోని మొలంగూర్ ఖిల్లాను సందర్శించి, దూద్‌బావి నీటిని సేవించారు. బావినీటి ప్రత్యేకతను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లారెడ్డి, న్యాయవాది శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

సోపాన మండపం ప్రారంభం

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీకాలనీ శ్రీమృత్యుంజయాలయంలో నూతనంగా నిర్మించిన సోపాన మండపాన్ని భారతీ తీర్థ పురస్కార గ్రహీత, ఆలయ సలహాదారు పురాణం మహేశ్వర శర్మ శనివారం ప్రారంభించారు. చైర్మన్ చల్లా మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు పురుషోత్తం శర్మ, పొత్తంశెట్టి శివకుమార్, పెద్ది రమేశ్, ఇనుగంటి మధుసూదన్‌రావు, పోలు కిషన్, దారం శ్రీనివాస్‌రెడ్డి, మాతంగి పరమేశ్వరి, బాలకృష్ణరావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. మండప నిర్మాణానికి సహకరించిన దాతలను సత్కరించారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

జమ్మికుంట: మండలంలోని పాపయ్యపల్లి గ్రామంలో అర్ధమండల మాలధారణ స్వాములు ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర శనివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల గుండా భక్తులు నృత్యాలు చేస్తూ శ్రీరామ నామస్మరణతో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కుల చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గురుస్వాములు మధు, శంకర్, శ్రీనివాస్, హరీశ్, శివ, వీరేశం, సురేశ్, నరేశ్ పాల్గొన్నారు.

షార్ట్ ఫిలిమ్స్‌తో అంతర్జాతీయ ఖ్యాతి

- సందేశాత్మక చిత్రాలతో సమాజంలో మార్పు తీసుకురావడమే లక్ష్యం
- హుజూరాబాద్‌కు చెందిన సార్థిక్‌కు పలువురి అభినందనలు



అమెరికాలో అవార్డు అందుకుంటున్న సార్థిక్

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణానికి చెందిన సార్థిక్ బొల్లు షార్ట్ ఫిలిమ్స్‌లో రాణిస్తున్నాడు. ఇటీవల తెరకెక్కించిన షార్ట్ ఫిలిమ్ 'ది రోడ్ నాట్ టేకెన్' అంతర్జాతీయ సినీ వేదికలపై ప్రశంసలు అందుకుంది. సార్థిక్ ప్రాథమిక విద్యాభ్యాసం హుజూరాబాద్, ఉన్నత విద్య హనుమకొండ, ఇంటర్, ఇంజినీరింగ్ హైదరాబాద్‌లో, అమెరికాలోని హూస్టన్ యూనివర్సిటీలో ఆరేళ్ల క్రితం ఎంఎస్ పూర్తి చేశాడు. అనంతరం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తూనే తక్కువ నిడివి గల చిత్రాలు తీస్తున్నాడు. చిన్నప్పటి నుంచి సినిమాలపై ఆసక్తి ఉండటంతో పీజీ పూర్తయిన తర్వాత ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ లేదా స్కూల్‌లో శిక్షణ తీసుకోవాలనుకున్న ఉద్యోగం కారణంగా వీలు కాలేదు. సార్థిక్ విభిన్న భాషా, దేశాల సినిమాలు, డాక్యుమెంటరీలు చూడడంతో పాటు పేరొందిన రచయితల బుక్స్ చదివే అలవాటు ఉంది. ఎంఎస్ పూర్తి చేసిన తర్వాత సినిమా తీయాలనే కలను నెరవేర్చుకునేందుకు సిద్ధమయ్యాడు. మొదట తక్కువ నిడివి ఉన్న సినిమా తీసేందుకు సన్నద్ధమయ్యాడు. అమెరికా కవి రాబర్ట్ ఫ్రాస్ట్ కవితలోని సారాంశం, జర్మన్ నావెలిస్ట్ ఫ్రాంజ్ కాఫ్కా నవల ఆధారంగా ఒక కథ రాసుకొని 'ది రోడ్ నాట్ టేకెన్' 14 నిమిషాల నిడివి షార్ట్ ఫిల్మ్‌ను దర్శకుడు, ఎడిటర్‌గా తెరకెక్కించాడు. మానవ సంబంధాలు, మానసిక సంఘర్షణ, భావోద్వేగాల ఇతివృత్తంగా ఉన్న ఫిల్మ్ పలు అవార్డులు గెలుచుకుంది. అమెరికాలో ప్రముఖ సంస్థ ఇండిమీమ్ 'ఆడియన్స్ చాయిస్ అవార్డు'అందజేసింది. పలు దేశాల్లో అవార్డులు అందజేసే ప్రముఖ సంస్థల నుంచి ప్రశంసలు అందుకుంది. ఉద్యోగం చేస్తూనే షార్ట్ ఫిలిమ్స్ తీస్తున్నా సార్థిక్‌ను భార్య ప్రత్యూష ప్రోత్సహిస్తోంది. భవిష్యత్‌లో సందేశాత్మక చిత్రాలను ప్రేక్షకులకు అందించి, మార్పు తీసుకురావాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నాడు. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన అమృత–ప్రణయ్‌ల సంఘటన తనను ప్రభావితం చేసిందని, దీని ఆధారంగా సందేశాత్మక చిత్రాన్ని తెరకెక్కించాలని అనుకుంటున్నట్లు 'సాక్షి'కి తెలిపారు.

యూఎస్ చానెల్స్‌లో ఇంటర్వ్యూలు

'ది రోడ్ నాట్ టేకెన్' పలు అవార్డులు అందుకున్న సందర్భంగా యూఎస్‌లోని ప్రముఖ చానెల్స్ సార్థిక్ ఇంటర్వ్యూను ప్రసారం చేశాయి. యూట్యూబ్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగామ్‌లో ప్రముఖ ఫిల్మ్ అవార్డుల సంస్థలు ఇంటర్వ్యూలను పోస్ట్ చేశాయి. సార్థిక్ ప్రతిభ, అభిరుచిని, నైపుణ్యాన్ని స్థానికులు అభినందిస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపై అవార్డులు అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్భంగా సార్థిక్ తల్లిదండ్రులు రాజేందర్, వరూధినిని పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై గ్రామస్తుల ఆగ్రహం

- మడిపల్లి గ్రామం మీదుగా 30కిపైగా ట్రాక్టర్లతో రవాణా
- పోలీసులకు ఫిర్యాదు, వాహనాలతో పరారు


ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

జమ్మికుంట: ఇసుక అక్రమంగా రవాణా చేయడమే కాకుండా అతి వేగంగా వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, నిత్యం 30కిపైగా ట్రాక్టర్లు గ్రామం మీదుగా వెళ్తుండటంతో బాటసారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారని మండలంలోని మడిపల్లి గ్రామస్తులు శనివారం వాహనాలు అడ్డుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరవైకి పైగా ట్రాక్టర్లను నిలిపేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వస్తున్నారనే విషయం తెలుసుకున్న ఇసుక అక్రమ రవాణాదారులు ట్రాక్టర్లతో పరారయ్యారు. రోడ్డు పైకి వాహన, పాదాచారులను ట్రాక్టర్లతో భయానిక వాతావరణానికి గురి చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపైకి రావాలంటే భయమేస్తుంది, ఇసుక రవాణా చేసుకొండి, ఇష్టానుసారంగా ట్రాక్టర్లు వేగంగా నడిపితే ఊరుకోబోమని హెచ్చరించారు. మండలంలోని మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రోజుకు వందలాది ట్రాక్టర్లు పట్టణ శివారు, గ్రామాల మీదు పోలీసుల కళ్లు కప్పి అక్రమ రవాణా దందా కొనసాగిస్తున్నారు. పోలీసులు పలువురిపై కేసు నమోదు చేసినప్పటికీ రెవెన్యూ, మైనింగ్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ట్రాక్టర్లకు నంబర్ ప్లేట్లు లేకపోవడంతోపాటు మైనర్లు వేగంగా డ్రైవింగ్ చేస్తున్నారని, ప్రమాదాలు జరిగితే గుర్తించేందుకు వీల్లేకుండా ఇసుక అక్రమార్కులు ఎంతకైనా తెగిస్తున్నారని అతి వేగంతో గతంలో పలువురు మృతి చెందిన సంఘటనలున్నాయని వాపోయారు. ఇసుక అక్రమ రవాణాకు రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు అడ్డుకట్ట వేయాలని కోరారు.

సద్దుమణిగిన వివాదం

శంకరపట్నం: మండలంలోని కరీంపేటలో ఎల్లమ్మ గుడికి తాళం వేసిన వివాదం శనివారం చర్చలతో సద్దు మణిగింది. గ్రామంలోని ఎల్లమ్మ గుడిలోకి గురువారం దళితులు ప్రవేశించకుండా గౌడ కులానికి చెందిన గుర్రం భిక్షపతి, తిరుపతి గుడికి తాళం వేశారని దళితులు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు శనివారం ఇరు వర్గాల పెద్ద మనుషుల సమక్షంలో చర్చలు జరిపారు. దళితులను ఆలయ దర్శనం చేసుకునేందుకు ఆటంకం కల్పించొద్దని నిర్ణయించారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలి

కరీంనగర్: సస్పెండ్ అయిన ఉపాధ్యాయులకు వెంటనే రీఇన్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శనివారం విద్యాశాఖ సూపరింటెండెంట్ నరసింహస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఇటీవల సస్పెండ్ అయిన నవాబ్‌పేట్, సైదాపూర్ మండలం నల్లాని తండా ఉపాధ్యాయుల సస్పెన్షన్ వెంటనే ఎత్తివేసి రీ ఇన్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వారి సస్పెన్షన్ సరికాదని వెంటనే వీరిని రీఇన్‌స్టిట్యూట్ చేయాలని కోరారు.

సర్టిఫికెట్ల రద్దుపై హర్షం

కరీంనగర్‌టౌన్/విద్యానగర్: పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం కులాలకు జారీచేసిన ఓబీసీల ధ్రువీకరణ పత్రాలను కోర్టు రద్దు చేయడం హర్షణీయమని బీజేపీ నాయకులు అన్నారు. సర్టిఫికెట్లను కలకత్తా కోర్టు రద్దు చేసి తీర్పును వెలువరించిన నేపథ్యంలో శనివారం బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుల ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 2010లో మమతాబెనర్జీ ప్రభుత్వం ముస్లింలకు ఓబీసీ సర్టిఫికెట్లు జారీ చేసిందని, దీంతో లక్షలాది మంది ఓబీసీలకు అందాల్సిన ప్రయోజనాలు కోల్పోవాల్సి వస్తుందని, నిజమైన ఓబీసీలు కలకత్తా హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. ఈ విషయంపై విచారణ చేపట్టిన హైకోర్టు సర్టిఫికెట్లను రద్దు చేస్తూ సంచల తీర్పు ఇచ్చిందని, ఇది మమతాబెనర్జీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదన్నారు.

ఆపరేషన్ 'కగార్' నిలిపివేయాలి


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

హుజూరాబాద్: పీడిత ప్రజలకు చెందిన సహజ సంపదను కొల్లగొట్టి కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు మోదీ–అమిత్ షాల నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీలపై కొనసాగిస్తున్న యుద్ధాన్ని తక్షణం నిలిపివేయాలని హుజూరాబాద్ ప్రాంతంలోని ప్రజా సంఘాలు, భారత్ బచావో, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు, సాహిత్య సంస్థల నాయకులు డిమాండ్ చేశారు. భారత్ బచావో సంస్థకు చెందిన భీమోజు సదానందం, పొడిశెట్టి వెంకట్రాజం, మాదిగ మేధావుల ఫోరం నాయకులు వేల్పుల రత్నం, మొగిలయ్య, జనసాహితి సాహిత్య సంస్థ కన్వీనర్ ఆవునూరి సమ్మయ్య, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు వేల్పుల ప్రభాకర్, మార్త రవీందర్ శనివారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఆపరేషన్ కగార్ పేరిట భారత సైన్యం ఆదివాసీలపై, మావోయిస్టు పార్టీ కార్యకర్తలపై అమానవీయంగా దాడులు జరుపుతూ ఎన్‌కౌంటర్ల పేరుతో అమాయక ఆదివాసీలను హత్యాకాండకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీల మెప్పు కోసం పాలకులు సైన్యం ద్వారా ప్రజలపైనే యుద్ధం కొసాగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి పని చేయాల్సిసిన ప్రభుత్వాలు వారిపై సైన్యాన్ని ఉసిగొల్పడం అప్రజాస్వామికమని, మధ్య భారతంలోని అటవీ ప్రాంతాల నుంచి తక్షణమే సైన్యాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలపై పాలకులు కొనసాగిస్తున్న మారణకాండపై సత్వరం న్యాయ విచారణ జరపాలని పేర్కొన్నారు.

వృథాగాపోతున్నా స్పందించని అధికారులు



చొప్పదండి: మండలలోని భూపాలపట్నంలో చెరువు నీరు వృథాగా పోతున్న స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు. గ్రామంలోని శివ చెరువులో నీటి నిల్వ మెండుగా ఉండగా కొద్ది రోజులుగా నీటిని ఖాళీ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ విషయంపై నీటి పారుదలశాఖ అధికారులకు సమాచారం అందించినా స్పందించడం లేదని ఆరోపించారు. స్థానిక సిబ్బందితో ఇటీవల నీరు వృథా కాకుండా అడ్డుకోగా శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తూం తెరిచారని, ఉదయం వరకు చెరువు నీరు వృథాగా పొలాల నుంచి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల్లో నీటిని వృద్ధి చేయాలి కానీ కొందరి స్వలాభం కోసం నీటిని చెరువు నుంచి ఖాళీ చేయాలని ప్రయత్నిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముగిసిన యోగా శిక్షణ



తిమ్మాపూర్: పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లి గ్రామ పాదుపు సంఘం భవనంలో నెల రోజులుగా కొనసాగుతున్న ఉచిత యోగా శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. చివరిరోజు రామాలయంలో దేవ యజ్ఞం నిర్వహించారు. పతాంజలి యోగా సమితి తిమ్మాపూర్ కోఆర్డినేటర్ నరేందర్ నేతత్వంలో నిర్వహించిన శిబిరంలో యోగాసనాలు, యోగిక జాగింగ్, సూర్య నమస్కారాలు, ధ్యానం, ప్రాణాయం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. దేవ యజ్ఞంలో ఆచార్య వేదయన్ మాట్లాడుతూ.. యజ్ఞంతో పర్యావరణం సమతుల్యమవుతుందని, యజ్ఞ థెరపీ ద్వారా వ్యాధులు నయం చేయవచ్చునన్నారు. రామాలయం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవయజ్ఞంలో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, యువ భారత్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు, పీఏసీసీఎస్ డైరెక్టర్ తిరుపతి గౌడ్, మాజీ ఎంపీటీసీ త్రిభువన, పాదుపు సంఘం అధ్యక్షుడు రాములు, మాజీ అధ్యక్షుడు రవీందర్, మాజీ ఉపసర్పంచ్ సుభద్ర, అంజిరెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, యోగా సాధకులు పాల్గొన్నారు.